సిపిఎస్ రద్దు కోరుతూ నేటి నుంచి నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎస్, జిపిఎస్‌లు రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19వ తేదీన స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద నిరవధిక దీక్ష చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 20వ తేదీన తాలూకా, డివిజన్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు దీక్ష చేపడతామని పేర్కొన్నారు. 21వ తేదీన సిపిఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు దీక్షలో కూర్చోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ ముందు నియామక ప్రక్రియ పూర్తి చేసుకున్న 11 వేలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణం పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏలూరులో జరిగే దీక్షలను ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రారంభిస్తారని తెలిపారు.

'ఉపాధి'పై కుట్రలు తిప్పికొడదాం

దుష్ప్రచారం చేస్తూ మోడీసర్కార్ నిధుల కోత
పనిదినాలు, వేతనపెంపుపై పోరాటం తప్పదు
ఉపాధి హామీ చట్టం రాష్ట్ర సదస్సులో వక్తలు
ముఖ్య అతిధులుగా వ్యకాస జాతీయనేత, ఎంపీ శివదాసన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ సర్కార్ కుట్రలు పన్నుతోందని, వ్యవసాయ కూలీలంతా ఏకతాటిపైకి వచ్చి ప్రతిఘటించి చట్టాన్ని కాపాడుకోవాల్సి ఉందని ఉపాధిహామీ పనిదినాలు, వేతనాల పెంపు, పట్టణాలకు వర్తింపజేయాలంటూ నిర్వహించిన రాష్ట్ర సదస్సులో వక్తలు ముక్తకంఠంతో చెప్పారు. బుధవారం ఏలూరులోని కాశీవిశ్వేశ్వర కల్యాణమండపంలో రాష్ట్ర సదస్సు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధులుగా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు, ఎంపీ శివదాసన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీచట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో రూ.28 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ఉపాధి చట్టం దండగ అంటూ దుష్ప్రచారం చేస్తూ దెబ్బతీయాలని చూస్తోందన్నారు. కరోనా సమయంలో ఉపాధి పనులే పేదలను కాపాడాయన్నారు. ఉపాధి హామీ పనిదినాలు 200 రోజులకు పెంచడంతోపాటు ప్రతియేటా రూ.మూడు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, పట్టణాల్లో ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న పలువురు నేతలు మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, పి.కిషోర్, ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెండు కోట్ల మందికి భూమి, ఇల్లు లేదు

వి.వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల కుటుంబాలకు భూమిగాని, ఇళ్ళుగాని లేవు. వీరంతా రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలే. పశ్చిమగోదావరిలో రెండు లక్షల ఎకరాలు ఆక్వా చెరువులుగా మారిపోయాయి. పనిదినాలు తగ్గిపోయాయి. రోడ్ల పనులు సైతం యంత్రాలే చేస్తున్నాయి. మరి పేదలు ఏవిధంగా బతకాలి. పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ సర్కార్ దెబ్బతీయాలని చూడటం దారుణం. ప్రతి కుటుంబానికీ రెండెకరాల భూమైనా, 200 రోజులు పనైనా ఉండాలి. ఉపాధి చట్టం భిక్ష కాదు. ఉపాధి సొమ్ముతో రోడ్లు, భవనాలు నిర్మిస్తూ కాంట్రాక్టర్లకు మేలు చేస్తున్నారు.

ఉపాధి చట్టాన్ని కలిసికట్టుగా కాపాడుకుందాం

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఉపాధి హామీ చట్టం అంటే బటన్ నొక్కి డబ్బులు వేసేది కాదు. ఆనాడు 2004లో పార్లమెంట్లో 63 మంది వామపక్ష సభ్యులు ఉండబట్టి పోరాడి సాధించుకున్న చట్టం. ఆ నాడు కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్ష నాయకులకు మంత్రి పదవులు ఇస్తానన్న వద్దని, ప్రజలకు ఉపయోగపడే పథకాలు కావాలని, అలాంటి పథకాలకు అంగీకరిస్తేనే మద్దతిస్తామని చెప్పటంతో గత్యంతరం లేక నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి అంగీకరించి చట్టం చేసింది. దీనిని ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో గ్రామీణ కూలీలు ఐక్యంగా దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజలు సంఘటితంగా పోరాడాలి

పోరండ్ల శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

రోజురోజుకీ ఉపాధి కూలీల సంఖ్య పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో చదువుకున్న యువత కూడా ఉపాధి కూలీలుగా మారుతున్నారు. గిట్టుబాటు ధరలు లేక నష్టాలు వచ్చి పేద రైతులు కూడా ఉపాధి కూలీలుగా మారుతున్నారు. ప్రభుత్వాలు పథకాలకు నిధులు పెంచకుండా ఉన్న పథకాలు నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన సిపిఎం ఇలాంటి సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఉపాధి హామీ లాంటి చట్టాలను కాపాడుకునేందుకు ప్రజలు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

కూలీలంటే ఈ ప్రభుత్వాలకు చిన్నచూపు

వి. శివ నాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేత

దేశంలో, రాష్ట్రంలో ఆకలి చావులు పెరిగాయి. కనీస వేతనాలు లేవు. ఉపాధి పనులు లేక గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలసలు పోతున్నారు. మరోపక్క వర్షాలు లేవు. పనుల కోసం కూలీలు ఆటోల్లో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వాలు నష్టపరిహారం ఇవ్వడం లేదు. కూలీలు అంటే ఈ ప్రభుత్వాలకు చిన్న చూపు ఉంది. ఈ సమస్యలను నవంబర్ 15న విజయవాడలో జరిగే సభలో చర్చించాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేలా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.

ఎర్రజెండా అధికారంలోకి రావాల్సిందే

షేక్ సాబ్జీ, ఉపాధ్యాయ ఎంఎల్‌సి

చట్టసభల్లో ఎర్ర జెండాకు ప్రాతినిధ్యం తగ్గడం వల్ల ప్రజా సమస్యల గురించి చర్చించేవాళ్లు లేకుండాపోతున్నారు. ప్రస్తుత పాలకులు కార్పొరేట్లు, భూస్వాముల లబ్ధి కోసం ఆలోచిస్తున్నారు తప్ప సామాన్య ప్రజల గురించి ఆలోచించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికైనా మేల్కొని ఎర్రజెండాకు ఓటు వేసి చట్టసభల్లో వామపక్ష ప్రతి నిధులు ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. మీ భవిష్యత్తు, మీ బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే ఎర్రజెండా అధికారంలోకి రావాల్సిందే.

చట్టాలను నీరుగారుస్తున్నారు

మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ జిల్లా కార్యదర్శి

ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి ఎన్నో చట్టాలు పోరాడి సాధించుకున్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వాలు వాటిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయి. దేశంలో సంపద అంతా కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోవాల్సి వస్తుంది. ఇద్దరు అమ్మేవాళ్లు, ఇద్దరు కొనేవాళ్లు ఈ దేశాన్ని శాసిస్తున్నారు. అలా కాకుండా అన్ని వర్గాలకు మేలు జరగాలంటే చట్టసభల్లో ఎర్రజెండా ప్రాతినిధ్యం పెరగాలి. ప్రజల ఆస్తులకు రక్షణ ఉండాలి. కాబట్టి రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి.

కరోనాలో ఉపాధి చట్టం గొప్పతనం తెలిసింది

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. కరోనా సమయంలో అందరికీ పని దొరికింది ఈ చట్టం వల్లే. చట్టం గొప్పతనం అప్పుడే అందరికీ తెలిసింది. పట్టణాల్లో పరిశ్రమలు మూతపడి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి పనులు కల్పించాలి.

ఓటింగ్ యంత్రాల తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఇవిఎంల తనిఖీ సక్రమంగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ కాంపౌండ్‌లో ఉన్న ఇవిఎం గొడౌన్లో ఇవిఎంలు, వివి ప్యాట్స్ ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ నెల 16న ఫస్ట్ లెవెల్ చెకింగ్ మొదలుపెట్టామని, నవంబర్ పదో తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని, సజావుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఎఫ్ఎల్‌సి నిర్వహిస్తున్న గొడౌన్ లోపలికి వెళ్లినప్పుడు సంబంధిత రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఎఫ్ఎల్‌సి పర్యవేక్షకులు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు తెగబడితే సహించం

జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహిళలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్, సిఐ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మేరీప్రశాంతి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఏలూరులో ఓ మహిళపై దుండగులు యాసిడ్ పోసి హత్య చేసిన ఘటనను గుర్తు చేశారు. దాడికి పాల్పడిన దుండగులకు జీవిత ఖైదు శిక్ష పడిందని తెలిపారు. మహిళలపై దాడులకు పాల్పడితే ఇటువంటి కఠిన శిక్షలు తప్పవని ఆమె హెచ్చరించారు. అలాగే ఎన్నికలు ముగిసే వరకూ జిల్లాలో ఆరు సరిహద్దు చెక్‌పోస్టులు నిరంతరం పని చేస్తుంటాయన్నారు. ఫోక్సో కేసులపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి సిఫార్సు చేశామని తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు పెంచడానికి కృషి చేస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడానికి నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. కోడి పందేలు, పేకాట వంటి జూద క్రీడల వైపు యువత ఆకర్షితులు కావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ పి.రాజేష్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

27న ఓటర్ల ముసాయిదాపై సమావేశం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈనెల 27న ఓటర్ల ముసాయిదా నోటిఫికేషన్ విడుదల కానుందని రాజకీయ పార్టీలు జాబితాలను సరిచూసుకుని ఏమైనా అభ్యంతరాలు, సమస్యలుంటే తెలియజేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కె.ఖాజావలీ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో 213 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. మండలంలోని కాకర్లమూడి పంచాయతీ పరిధి తోటరామచంద్రపురంలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఉంగుటూరు-1, నిడమర్రు-9, గణపవరం-5 మొత్తం 15 పోలింగ్ కేంద్రాలను వేరే చోటకు మార్చడం, ఉంగుటూరు-2, నిడమర్రు-4, గణపవరం-3 పోలింగు కేంద్రాల పేర్లు మార్చేందుకు ప్రతిపాదనలు ఎన్నికల సంఘానికి పంపామని, అనుమతులు రావాల్సి ఉందని ఆర్‌డిఒ వివరించారు. వైసిపి నాయకులు పాపారావు బాబ్జీ, జెడ్‌పిటిసి సభ్యులు సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైస్‌ఎంపిపి మేడవరపు విద్యాలక్ష్మి, టిడిపి నాయకుడు ఉండవల్లి బాలానందం, తహశీల్దారు ఎవి.రమణారావు, ఎన్నికల సీనియర్ సహాయకులు సాయిరమేష్ పాల్గొన్నారు.

20న ఆటోనగర్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆటో నగర్ సంఘానికి ఇటీవల నిలిచిపోయిన ఎన్నికలను ఈ నెల 20న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామని ది ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికల కమిటీ సభ్యులు కర్రి మహేశ్వరరావు, మల్లవరపు రంగారావు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు అంతా ప్రశాంత వాతావరణంలో అసోసియేషన్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. బుధవారం ఏలూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 7, 8 తేదీల్లో నామినేషన్లను స్వీకరించి, 9న పరిశీలించామని, 10న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. అప్పటికి సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ ఎన్నిక ఏకగ్రీవమైందని తెలిపారు. మిగిలిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థుల జాబితాను ప్రచురించామని తెలిపారు. మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం అల్లర్లు సృష్టించే అవకాశం ఉందనే సమాచారం పోలీసు వారికి సమాచారం అందించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. పోలింగ్ ఏలూరులోని పోలీస్ కల్యాణ మండపంలో నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కోసం 'నా దేశం-నా మట్టి' కార్యక్రమం చేపట్టామని, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆగిరిపల్లి గ్రామ సర్పంచి లక్ష్మీ విక్టర్‌బాబు అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా నెహ్రూ యువకేంద్రం సహకారంతో, ఆనంద మహిళా మండలి ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకూ మట్టి కలశాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శేఖర్, ఎఒ అబ్దుల్ సలీం, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, ఆనందమహిళా మండలి అధ్యక్షురాలు సంధ్యారాణి, ఎంఎస్‌కె.క్రీస్తురాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలశాలతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సెలవుల్లో తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దసరా సెలవుల్లో విద్యాసంస్థలు నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ పట్టణంలో విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వం ప్రకటించిన దసరా సెలవులను పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని ఆయా యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ఎంఇఒ రాముడుకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. విద్యాసంస్థలతో కుమ్మక్కైనిబంధనలను తుంగలో తొక్కి నిర్లక్ష్యం కనపరుస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. సెలవు రోజుల్లో పిల్లలు స్కూలుకు రాకపోతే ఫైన్ కట్టిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, తహశీల్దా జోక్యం చేసుకోవాలని, లేనిపక్షంలో ఈ సమస్యలపై విద్యాసంస్థల మీద చర్యలు కోరుతూ డిఇఒకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, సూర్యచంద్రరావు, యాగంటి సీత, కె.సుబ్బారావు, జి.రాంబాబు పాల్గొన్నారు.

పంపుసెట్లు అందిస్తున్న ఎంఎల్‌ఎ

జలసిరి లబ్ధిదారులకు పంపుసెట్లు అందజేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైఎస్‌ఆర్ జలకళ పథకంలో నియోజకవర్గంలో బోరు నిర్మించుకున్న రైతులకు సబ్‌మెర్సిబుల్ మోటారు, పంపు సెట్లు, కేబుళ్లు తదితర పరికరాలను ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో 291 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా అధికార యంత్రాంగం అర్హత, నియమ నిబంధనలు పరిశీలించి 240 మంది దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు. అందులో 235 మంది రైతులు తమ పొలాల్లో బోర్లు నిర్మించుకున్నారని, వారికి మోటార్లు, పంపు సెట్లు 56 వచ్చాయని తెలిపారు. మిగతా పంపుసెట్లు, మోటార్లు కూడా త్వరలో వస్తాయన్నారు. పేద రైతులు వ్యవసాయం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగడమే వైఎస్‌ఆర్ జలకళ లక్ష్యమన్నారు. గొల్లగూడేనికి చెందిన వైసిపి నాయకుడు మలకపల్లి నాగు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా 26 బోర్లు ఒక్క గొల్లగూడేనికి మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. గత టిడిపి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వైసిపిలో రైతులంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎన్ఆర్ఇసిఎస్ ఎపిడి సుధాకర్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు జయలక్ష్మి, ఎంపిడిఒ ప్రేమాన్విత, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

తాగునీరు విడుదలకు ఎంఎల్ఎ చర్యలు

కలిదిండి: మండలంలో తాగునీటి సరఫరాకు కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు లాకుల వద్దకు స్థానిక నాయకులతో కలిసి వెళ్లారు. తక్షణం కలిదిండి మండలానికి సిబి కెనాల్ ద్వారా తాగునీటిని విడుదల చేయాలని అక్కడి అధికారులకు తెలిపారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, కలిదిండి సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దీక్షను విరమిస్తున్న నాయకులు

ముగిసిన సిపిఎం రిలే దీక్షలు

ప్రజాశక్తి - కుక్కునూరు

అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు ముంపుతో సంబంధం లేకుండా మండలంలో నిలిచిన అభివృద్ధి పనులను కొనసాగించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజైన బుధవారం ముగిశాయి. అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత బి.వెంకటేశ్వర్లు, సామాజికవేత్త మణికంఠ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు వై.సాయికిరణ్ మాట్లాడుతూ మండలంలోని రోడ్డు సమస్య, విద్యుత్ కోతలు, ప్రధాన సెంటర్లో మహిళలకు మరుగుదొడ్లు, అంతర్గత రహదారుల మరమ్మతు తదితర సమస్యల పరిష్కారానికి మూడు రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించామన్నారు. దీనిపై అటు పాలకులు, ఇటు అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో దశలవారీ ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ దీక్షల్లో సిపిఎం నేతలు బయ్యన శ్రీను, మహబూబ్ పాషా, పుల్లు, వలీపాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామవార్డు వాలంటీరు అఘాయిత్యం..

గర్భవతిని చేసిన వైనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బాలికపై గ్రామవార్డు వాలంటీరు అత్యాచారానికి పాల్పడి, ఆపై గర్భవతిని చేసిన ఘటన దెందులూరు మండలంలో వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన నీలాపు శివకుమార్ వాలంటీరుగా పనిచేస్తున్నాడు. అదే మండలానికి చెందిన బాలిక ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఆ బాలికపై కన్నేసిన శివకుమార్ ఇంటిలో ఎవరూ లేని సమయంలో పలుమార్లు ఇంటికి వెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక ఎవరికీ చెప్పలేకపోయింది. ఈ క్రమంలో బాలిక అనారోగ్యంగా ఉడటంతో తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో ఆమె అసలు చెప్పింది. అనంతరం ఆమె గర్భందాల్చినట్లు గుర్తించారు. వెంటనే బంధువులు, తల్లిదండ్రులు దిశా పోలీసులను ఆశ్రయించారు. అనంతరం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడు నీలాపు శివకుమార్‌ను అరెస్టు రిమాండ్‌కు పంపినట్లు నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

పోలీసుల అదుపులో శివకుమార్

వాలంటీరుపై కఠిన చర్యలు తీసుకోవాలి : చింతమనేని

బాలికను గర్భవతిని చేసిన గ్రామవార్డు వాలంటీర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అదనపు ఎస్‌పి భాస్కర్‌రావుకు దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి నేత చింతమనేని ప్రభాకర్ వినతిని అందజేశారు. బాలికపై జరిగిన అఘాయిత్యంపై స్పందించిన ఆయన జిల్లా పోలీస్ కార్యాలయానికి బుధవారం వెళ్లి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివకుమార్ బాలిక తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటికి వెళ్లి ఆధార్ కార్డు వివరాలు నమోదు అంటూ బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేశాడన్నారు.

కార్యక్రమంలో టిడిపి నాయకులు రోషన్, మహిళలు

వైసిపి పాలనలో మహిళలకు భద్రత లేదు

'బాబుతో నేను' కార్యక్రమంలో రోషన్ కుమార్

చింతలపూడి : వైసిపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ, ఆర్థిక భద్రత లేకుండా పోయిందని చింతలపూడి టిడిపి నియోజకవర్గ యువనాయకులు సొంగా రోషన్ కుమార్ తెలిపారు. మండలంలోని అంతోనినగర్ గ్రామ మహిళలతో నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు టిడిపి మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ద్వాక్రా సంఘాలు ప్రవేశపెట్టి మహిళలకు ఆర్థిక భద్రత కల్పించిన చంద్రబాబుకు మద్దతుగా ఉంటామని తెలియజేశారు.

ముసునూరు : చంద్రబాబు నాయుడుని అక్రమంగా [illegible] అరెస్టు చేయటం అన్యాయమని టిడిపి తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు విమర్శించారు. బుధవారం టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్ట్ కార్డుల ద్వారా విషయాన్ని తెలియజేస్తున్నామన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

మండవల్లి : గ్రామంలోని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేవిధంగా గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ తెలిపారు. గ్రామంలోని పల్లెకారుల బజారులో బుధవారం డ్రయినేజీలో నిలిచిపోయిన వ్యర్థాలను తొలగించే పారిశుధ్య పనులు ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో డ్రయినేజీని క్లీన్ చేయించి, బ్లీచింగ్‌తో పాటు దోమల మందులు కూడా పిచికారీ చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్థానిక ఎంఎల్ఎ డిఎన్ఆర్, గ్రామ పెద్దల సహాయ సహకారాలతో గ్రామంలో డ్రయినేజీ నిర్మించుకోవడంతోపాటు, సిసి రోడ్డు కూడా నిర్మించుకోగలిగామని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి, ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రత్నకుమార్ పాల్గొన్నారు.

వాహన చోదకులకు అవగాహన

నూజివీడు రూరల్ : పట్టణంలో ప్రధాన రహదారులపైన వాహన చోదకులకు పోలీసులు బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ లైసెన్స్ లేనిదే వాహనం నడపరాదని, మైనారిటీ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయుట, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ టేకింగ్ వంటివి పెను ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. ప్రతి వాహన చోదకుడు తగిన పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ఉండాలని ఆయన సూచించారు.

'జగన్‌ను మళ్లీ సిఎం చేస్తాం'

వైసిపి బస్సు యాత్రకు మాల మహానాడు, మాదిగ దండోరా మద్దతు

ముదినేపల్లి : ఈనెల 26 నుంచి ప్రారంభంకానున్న వైసిపి బస్సు యాత్రకు రాష్ట్ర మాలల తరఫున మద్దతు ప్రకటిస్తూ రాష్ట్రంలో ఉన్నటువంటి పేదవారి అభివృద్ధి కోసం సిఎం జగన్ పలు కార్యక్రమాలు చేపట్టారని, జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసే తీరుతామని మాల మహానాడు, మాదిగ దండోరా నాయకులు తెలిపారు. వైసిపి తలపెట్టనున్న బస్సు యాత్రకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ సేవనాగ జగన్ బాబూరావు, రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షులు ఏసుపాదం దానియేలు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు, మాదిగ దండోరా కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు సన్నద్ధం

నూజివీడు రూరల్ : పట్టణంలో దసరా వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ మళ్లింపు, శానిటేషన్ నిర్వహణ, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, పట్టణ సిఐ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

గాజాపై దాడులు ఆపాలి

జంగారెడ్డిగూడెం : గాజాపై ఇజ్రాయిల్ మారణకాండను నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి కెవి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు, పిడిఎస్‌యు సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రమణ మాట్లాడుతూ గత రాత్రి గాజాలో ఓ ఆసుపత్రిపై వైమానిక దాడి చేసి, 500 మందిని చంపేశారని తెలిపారు. దీన్ని ప్రపంచ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ సమావేశంలో పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.లత పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తప్పిపోయిన బాలుడు అప్పగింత

ఏలూరు : ఏలూరు-1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయి బజార్లో తిరుగుతున్న తొమ్మిది సంవత్సరాలు వయసు కలిగిన బాలుడును వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు తిరిగి అప్పగించారు. వివరాల్లోకెళితే.. వన్‌టౌన్ పరిధిలో తిరుగుతున్న బాలుడ్ని ఏలూరు వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మణ బాబు, వారి సిబ్బంది సదరు బాలుడిని వివరాలు అడగగా పాలకొల్లు మండలం పెంకులపాడు గ్రామమని తెలిపారు. వన్ టౌన్ ప్రాంతంలో ఉన్న కత్తెపు వీధిలో వివాహానికి వచ్చి, అక్కడి నుంచి బయటకు వచ్చి దారి తెలియక తిరుగుతున్నట్లు తెలిపాడు. దీంతో పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ద్వారా బాలుడి సమాచారాన్ని వారి బంధువులకు అందించగా.. బాలుడు తండ్రి గతంలో చనిపోయినట్లు, తల్లి కువైట్లో ఉన్నట్లు, మేనమామతో పాటుగా ఏలూరు పెళ్లికి వచ్చినట్లుగా తెలిసి బాలుడు మేన మామకు సమాచారం అందించారు. బాలుడును క్షేమంగా అప్పగించడంతో ఇన్స్‌పెక్టర్, ఎస్ఐని మేనమామ అభినందించారు.

జామాయిల్ బాదులు పట్టివేత

జీలుగుమిల్లి : మండలంలోని సిర్రి వారి గూడెం అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ట్రాక్టర్‌పై తరలిస్తున్న జామాయిల్ బాధులను పట్టుకున్నట్లు అటవీ శాఖ డిప్యూటి రేంజ్ అధికారి విశ్వేశ్వరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అటవి నుంచి జామాయిల్ బాధులను అక్రమంగా నరుక్కుపోతున్నారని సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున బీట్ అధికారి లలిత ఆధ్వర్యంలో విఎస్ఎస్ సిబ్బంది కాపు కాయగా ట్రాక్టర్‌పై సుమారు 35 బాదుల వరకు లోడ్ చేసుకొని వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అటవీ సిబ్బందిని చూసిన ట్రాక్టర్ మీద వున్న దుండగులు పారి పోయారన్నారు. సరుకును, ట్రాక్టర్‌ను జంగారెడ్డిగూడెం అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి, సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులలో అటవీ శాఖ బీట్ అధికార్లు మారేష్ పాల్గొన్నారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తులు అరెస్టు

ఆగిరిపల్లి : గంజాయి కలిగివున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 11,25 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొన్న సంఘటన మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం తనకు రాబడిన సమాచారం మేరకు వడ్లమాను కరెంట్ ఆఫీస్ వద్ద గంజాయి కలిగివున్న మల్లెల వెంకట సుబ్రహ్మణ్యం సాయి లోహిత్(19), బొమ్మనబోయిన శివాజీ(21), గంపా గోపి సాయి కుమార్ అను ముగ్గురు వ్యక్తులను ఆగిరిపల్లి తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు సమక్షంలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11,25 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నూజివీడు రూరల్ సిఐ పి.బాల సురేష్ ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచడం జరిగిందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేదల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - మండవల్లి

ఆరోగ్య సమస్యలపై పేద ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేవిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు స్పష్టం చేశారు. మండలంలోని ఉనికిలి గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి అగస్తి ఆది విష్ణు, సర్పంచి ఇమిడి అన్నమ్మ, సర్పంచులు ఫోరం అధ్యక్షులు బేతపూడి ఏసేవ రాజు, బొమ్మన బోయిన వరప్రసాద్, నిమ్మగడ్డ నారాయణ, ఇమిడి మరియన్న, వల్లూరి వెంకటరత్నం, కొరపాటి దేవేంద్రుడు, కార్య ఏసురత్నం, కలంకూరి అదృష్టరావు బొమ్మలపైన కాంతారావు పాల్గొన్నారు.

మండవల్లిలోని ఉనికిలి సురక్షలో ఎంఎల్ఎ డిఎన్ఆర్

ముదినేపల్లి : ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పెయ్యేరు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పెయ్యేరు సర్పంచి అల్లు సుశీల, ఎంపిటిసి కోటే ప్రవీణ్, నాయకులు జాస్తి చంటి, బేతపూడి వెంకటరమణ, మండల కో-ఆప్షన్ సభ్యులు, షేక్ అల్లాబక్షు, కోమటి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని పోతనపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విచ్చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి, మాజీ సర్పంచి కారంగుల శ్రీనివాసరావు, ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు, డిఎంహెచ్ఒ ఆశ, ఇఒపిఆర్‌డి మురళీకృష్ణ, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టి.నరసాపురం : జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా తెలిపారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగా కుమారి, సర్పంచి తుమ్మూరి మాధవీలత, శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి గాది రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, పంచాయతీల విస్తరణాధికారి ఎంవిఎస్ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలతో సర్వసభ్య సమావేశం

సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు

జీలుగుమిల్లి : మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాల్సిన మండల అధికారులు లేకుండా సర్వసభ్య సమావేశం జీలుగుమిల్లిలో బుధవారం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు కోర్స పోసమ్మ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది ఎవరూ హాజరు కాకపోవడంతో ఏదో తూతు మంత్రంగా ఖాళీ కుర్చీలతో సమావేశం నిర్వహించారు. ఖాళీ కుర్చీలు చూసి ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్‌ను ప్రజా ప్రతినిధులు కొంతమంది ప్రశ్నించడంతో అందరికీ చెప్పడం జరిగిందన్నారు. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమావేశానికి రాని వారిపై చర్యలు తీసుకోవాలని సమావేశ హాలు నుంచి బయటకు వచ్చేశారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ ఉదయభాస్కరరావు

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

ఆగిరిపల్లి : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్స్‌కు అర్హులైన లబ్ధిదారులు ధరఖాస్తు చేసుకోవాలని ఆగిరిపల్లి తహశీల్దార్ ఎం.ఉదయ భాస్కరరావు కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగివుండి, గతంలో గ్యాస్ కనెక్షన్ లేనివారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పథకానికి భార్యభర్తల ఇరువురి ఆధార్ కార్డుల జిరాక్స్‌లు, బ్యాంక్ పాసుపుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన మహిళలు కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. లబ్ధిదారులు సమర్పించిన దరఖాస్తులను గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఇకెవైసి చేయటం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్స్‌ను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక శ్రీభాగ్యలక్ష్మీ ఇండియన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీభాగ్యలక్ష్మీ ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు పివి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారమందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎండిపోయిన వరి పొలాలకి రూ.50 వేల నష్టం పరిహారం అందించాలని మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ తెలిపారు. మండలంలో సమ్మేటివారిగూడెంలో పాతచింతలపూడి, శివపురం రైతులతో టిడిపి శివపురం ఎంపిటిసి చీకటి రాజేంద్రకపూర్‌తో కలిసి ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లోన్లు రద్దు చేసి, రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు ఇవ్వాలని తెలిపారు. బేతుపల్లి చెరువు, ఆంధ్రా కాలువకు పడిన గండ్లు పూడ్చితే రైతులకు ఎంతో ఉపయోగమని, వరి పంటలు ఎండిపోకుండా నీరు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత చింతలపూడి, సమ్మేటవారి గూడెం, శివపురం, గణిచర్ల రైతులు పాల్గొన్నారు.



ఎండిపోయిన వరిపైరులను చూపిస్తున్న మురళీ, ఎంపిటిసి

ప్రజలకు తిరుగులేని అస్త్రం.. సమాచార హక్కు చట్టం

మండవల్లి : ప్రజల చేతుల్లో ఉన్న తిరుగులేని అస్త్రం సమాచార హక్కు చట్టం అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు తెలిపారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా శోభనాద్రిపురంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గ్రామసభలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలనే ఉద్దేశంతో అవినీతి అంతమొందించేందుకు రూపొందించిన చట్టమే సమాచార హక్కు చట్టమని ఆయన తెలిపారు. దేశంలో ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ ప్రజల చేతుల్లో ఉన్న ఏకైక చట్టం సమాచార హక్కు చట్టమన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయం నుంచైనా సమాచారం కోరేందుకు ఈ చట్టం హక్కును కల్పించాలన్నారు. ఈ చట్టాన్ని సక్రమంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల చట్టాన్ని తీసుకువచ్చి, 18 సంవత్సరాలు గడిచినా, సమాచార హక్కు చట్టంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోలేకపోయారని, అందువల్లే చట్టాన్ని సమగ్రంగా వినియోగించుకోలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఈ చట్టంపై అవగాహన పెంచుకొని అవినీతిని అంతమొందించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మండల అధ్యక్షులు తింటూ అప్పారావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో పదిమంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మాత్రమే తలసేమియా, సికిల్ సెల్ అనీమియా చిన్నారులను ఆదుకోగలమని అన్నారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 25 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత వల్లభనేని రామకృష్ణకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, మానవత సభ్యులు మేడికొండ పద్మజ, కడియాల కృష్ణారావు, మేతరాజబాబు పాల్గొన్నారు.

చిన్నారితో రెడ్‌క్రాస్ సిబ్బంది

పూర్తిస్థాయిలో కార్డుదారులకు రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు అధికారులు స్పందించి బుధవారం పూర్తిస్థాయిలో కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. ముదినేపల్లి సచివాలయం-1 పరిధిలో ఉన్న కార్డుదారులకు గత మూడు నెలలుగా పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ జరగడం లేదు. ఈ సచివాలయం పరిధిలో 750 కార్డులు ఉండగా, కేవలం 600 కార్డులకు మాత్రమే మూడు నెలలుగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. మిగిలిన 150 కార్డుదారులకు రేషన్ అందకపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 18వ తేదీ బుధవారం రేషన్ అందక కార్డుదారులు అవస్థలు అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ వార్తతో వెంటనే స్పందించిన సంబంధిత శాఖ అధికారులు సచివాలయం-1 పరిధిలోని 750 కార్డులకు పూర్తిస్థాయిలో రేషన్ సరఫరా చేశారు. దీంతో సదరు వాహనం ఆపరేటర్ మూడు నెలలుగా కోత విధిస్తున్న 150 మంది కార్డుదారులకు కూడా రేషన్ పంపిణీ చేశారు. గత మూడు నెలలుగా రేషన్ అందక ఇబ్బంది పడుతున్న కార్డుదారులకు కూడా రేషన్ పంపిణీ జరగడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న ఆపరేటర్

పోస్టాఫీస్ పథకాలను ప్రజలకు వివరించాలి

బుట్టాయగూడెం : తపాలా శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, ప్రజలకు మేలు చేకూరే విధంగా కృషి చేయాలని సూపరిండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ బుంగా అంబేద్కర్ రాజ్ తెలిపారు. బుట్టాయిగూడెం సబ్‌పోస్ట్ ఆఫీస్‌లో బుధవారం జనంలోకి మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని శ్రీరామపురంకు చెందిన ఎంసిహెచ్.సత్యనారాయణకు ఆర్‌పిఎల్ఐ ద్వారా మంజూరైన రూ.8.30 లక్షల చెక్కును అందించారు. ఎంసిహెచ్.సత్యనారాయణ భార్య ఎం.రామలక్ష్మి పేరిట ఆర్‌పిఎల్ఐ తీసుకుని సుమారు రూ.30 వేలు చెల్లించారు. కానీ అకస్మాత్తుగా రామలక్ష్మి కొంతకాలం క్రితం మరణించడంతో ఆర్‌పిఎల్ఐ క్లైమ్ సుమారు రూ. 8.30 లక్షల వరకు మంజూరైంది. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఎఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఆర్‌పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కెఎస్.బుచ్చిబాబు, బుట్టాయగూడెం సబ్‌పోస్ట్ మాస్టర్ చింతపల్లి వెంకటేశ్వరరావు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు పరిశీలన

పోలవరం : మండల కేంద్రంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లను మండల విద్యుత్ శాఖ ఎఇ కె.సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఇటీవల పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ ఉప సర్పంచి మంగిన కొండ మండల కేంద్రంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాత పోలవరం, పెద్ద రామాలయం వీధి, సంగినీడి వారి వీధి, వడ్డీల వీధి ప్రాంతాల్లో పలుచోట్ల విద్యుత్ లైన్లు, స్తంభాలు పరిశీలించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయా ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు.

ఉపాధి హామీ చట్టంలో 68 పనుల గుర్తింపు

పోలవరం : పనుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా 68 పనులను గ్రామసభలో చదివి వినిపించామని ఎపిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఇటికలకోట గ్రామ పంచాయతీ నందు ఉపాధి హామీ చట్టం ప్లానింగ్ 2024-2025 ఫైనల్ గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటుకలకోట గ్రామ సర్పంచి సున్నం చంద్రమ్మ, సచివాలయ సెక్రెటరీ కృష్ణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది, మేట్లు, కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలి : ఎంఎల్ఎ

అమూల్ పాల సేకరణ భారం పంచాయతీలపైనే : చేబ్రోలు సర్పంచి

సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై గళం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు వచ్చే వారికి చేతనైనా చేయూత, సహకారం అందిస్తే జీవితాంతం మీపై కృతజ్ఞతా భావంతో ఉంటారని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విషయంలో సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని 48 కాలనీల్లో కొత్తగా 5 వేల ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రానున్నాయన్నారు. రూ.16 కోట్లతో ఇందిరమ్మ, జగనన్న కాలనీతో పాటు సొంత స్థలాలు ఉన్నవారికి కూడా గృహాలు నిర్మించుకునేందుకు అన్ని ప్రతిపాదనలు పంపించామని, త్వరలో వాటికి అనుమతులు రానున్నాయన్నారు. తాజాగా 1870 పేర్లు అధికారులు ఆన్‌లైన్ చేశారన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్నవారు కట్టుకున్న వారికే బిల్లులు వస్తాయన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో కేంద్రం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటాలతో గ్రామాల్లో తాగునీటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. గొల్లగూడెం ఎంపిటిసి సభ్యుడు మాట్లాడుతూ నిధులు మంజూరైనా తాగునీటి పనులు చేపట్టలేదన్నారు. వెల్లమిల్లిలో 1.20 లక్షల లీటర్ల తాగునీటి ట్యాంకు లీకవుతోందని, కొత్తది నిర్మించాలని కోరారు. అమూల్ పాల సేకరణలో మహిళలకు లీటరుకు ఒక్క రూపాయి కమీషన్ సక్రమంగా రావడం లేదని, దాని ప్రభావం పంచాయతీపై భారం పడుతోందని సర్పంచి రాంధే లక్ష్మీ సునీత తెలిపారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్ ఎంపిపిలు సింగిరెడ్డి సూర్యనారాయణ, మేడవరపు విద్యారాణి, పిఆర్ డిఇ ఉప్పలపాటి శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరి రాజశేఖర్‌కు మాతృవియోగం

తణుకు : ప్రజాశక్తి తణుకు రూరల్ రి పోర్టర్ చిల్ల రాజశేఖర్ తల్లి బుధవారం అ నారోగ్యంతో మృతి చెందారు. చిల్ల సౌదామణి(70) కొంత కాలంగా అనారోగ్యం తో బాధ పడుతున్నారు. బుధవారం ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. సౌదామణి భర్త సాల్మన్ టీచర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజశేఖర్ ప్రజాశక్తి విలేకరిగా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు సుధాకర్ హైదరాబాదులో ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. రాజశేఖర్ భార్య సుభాషిణి తణుకులో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్నారు. రాజశేఖర్, సుభాషిణి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సౌదామణి సొంత ఊరు భీమవరంలో గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు రాజశేఖర్ తెలిపారు. సౌదామణి మృతి పట్ల ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, జిల్లా డెస్క్ ఇన్‌ఛార్జి వివిఎస్-ఎస్‌వి.ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజు, జిల్లా ఎడివిటి ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి వై.సీతారాం, ఎడివిటి డివిజన్ ఇన్‌ఛార్జి కె.బాలాజీ తదితరులు సంతాపం తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఏలూరు టౌన్ : ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక రామచంద్రరావు పేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద విశాలాంధ్ర మొబైల్ బుక్ హౌస్‌ను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకనుగుణంగా, అభ్యుదయ భావాలతో ప్రజలకు అవగాహన కలిగే విధంగా పుస్తక రూపంలో అనేక విషయాలు ప్రచురితమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఉంగుటూరు : ప్రజల సమస్యలు పరిష్కారానికి జనసేన ముందుంటుందని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. రెండవ రోజు జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరులో బుధవారం సాయి బాబాగుడి దగ్గర నుంచి ప్రారంభించి హరిజన పేట, సాలి పేట, తూర్పు కాపు రామాలయం విధులలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పంది రాంబాబు, నిమ్మల దొరబాబు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి సిసిఆర్‌సి కార్డులు పంపిణీ

ఏలూరు : జిల్లాలో 2023-24లో 56,433 సిసిఆర్‌సి పత్రాల పంపిణీ చేయాలనే లక్ష్యానికి మించి ఇప్పటివరకు 59,538(106 శాతం) పత్రాలను కౌలు రైతులకు అందజేశామని జిల్లా ఎడి వై.రామకృష్ణ తెలిపారు. వారిలో ఇంతవరకు 23,136 మంది కార్డుదారులకు రూ.90.67 కోట్ల పంట రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించామని తెలియజేశారు.

NOTICE
Notice of Will Enquiry Under Section 41 (2) of Registration Act 1908: WilCASE No. 1OF 2023

Notice is hereby given to all whom so ever it may concern that Mr. Bethireddy Tatareddy S/o. Mr. B. Sur .yanarayana Reddy aged about 36 years Occupation Advocate, Resident of House No. 6-6-404/2, Behind CGO Towers, Gandhi Nagar, Secunderabad, Hyderabad .District - 500 080, Telangana State, presented on 16th August, 2023 before me a Will alleged to have been executed on 16th April,2021 by his mother late Smt. Bethireddy akshmikantham W/o; Sri B. Suryanarayana Resident of House No. 6-6-404/2, Behind CGO Towers, Gandhi Nagar, Secunderabad, Hyderabad District - 500 080, Telangana State, bequeathing her immovable and movable properties situated at Poduru village and Mandal, West Godavari District, Andhra Pradesh and Hyderabad in favour of (1) Mr. Bethireddy Suryanarayana S/o. Mr. late B. Tata Reddy aged about 72 years (Husband) (2) Ms. Bethireddy Bhavani D/o. ate S.R. Bethireddy aged 47 years (Daughter) (3) Mr. Bethireddy Tatareddy S/o. Mr. B. Surtyanarayana Reddy aged about 36 years (Son) all are resident of Secunderabad Telangana State, for registration of the Will after her death (Testatrix) under Section 41 (2) (b) of the Registration Act 1908 and the enquiry will be held by the under signed on 04-11-2023.

All those interested are hereby requested to appear before the Enquiry Officer, on the above date with their witnesses and other evidence if any in support of their contentions. If witnesses on behalf of any one to be summoned, application together with required fee should be credited with the enquiry officer fifteen days before the date fixed for enquiry.

SCHEDULED "A" IMMOVABLE PROPERTIES

(1) all that Flat bearing No. 101, in Imperial House, situated at 6-3- 865/A, Ameerpet, Hyderabad - 500 016.
(2) Agriculture land admeasuring 0.50 cents (including 0.40 cents of coconut garden) situated under survey Nos. 65-3 and 67-2, situated at Kavitam and 0-72 cents of agriculture lands situated under survey No. 159/1, situated at Poduru village (near Kavitam locks) Poduru Manda, West Godavari District, Andhra Pradesh state.

SCHEDULED "B" MOVABLE ASSETS

(1) the moveable properties all that Term deposits in various Banks, Deposit under Senior Citizens savings scheme in SBI and PPF Account in Secunderabad HPO in her name and Saving Bank Accounts in SBI and Indian Bank jointly with my husband and Gold ornaments weighing about 350 grams

Dated: 18-10-2023:
Office of the Sub-Registrar Secunderabad at Kavadiguda:

పాస్‌పోర్టు పోయినది

కడిమి సంధ్య, భర్త: కిరణ్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు యింటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నంబర్ **U8130907** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
కడిమి సంధ్య, భర్త: కిరణ్
డోర్ నంబర్: 15-173
రాజుగూడెం, పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 79952 32782